# మాటలొచ్చు



వి.వి.బి. రామారావు

ఆకుర్రాడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు.

వయసు ఓ పదికొండేళ్లుంటాయేమో. పొడుగాటి జుట్టు కొప్పులా పెంచుకున్నాడు. నుదుటన బొట్టు. చెవు తమ్మెలకు కన్నాలు. మాసిపోయిన చొక్కా, తనకంటె నాలుగైదు సైజులు పెద్దదయిన నిక్కరు. చేతుల్లో ఇత్తడి పళ్లెం. అందులో దేవుడి పటం.

ఇంటింటా అడుక్కుంటున్నాడు.

పళ్లెంలో గంట ఎడంచేతిలో పట్టుకుని ప్రతి యింటిముందూ ఆగి గణగణా వాయిస్తున్నాడు. ఇంటిలో వాళ్లెవరయినా బయటికి వస్తే మూగవాడిలా వింత ధ్వనులు చేస్తూ పళ్లెంలో చిల్లర చప్పుడు చేస్తున్నాడు.

అతనివంక అప్పటికే ముగ్గురు పిల్లలు వింతగా కళ్లు పెద్దవిచేసుకుని చూస్తున్నారు.

—"దొంగ వెధవలు. కూటికోసం కోటి విద్యలు. కోటిన్నర వేషాలు. మూగా కాదు, పాడూ కాదూ. ఇదో యాచన, అంతే!"

ఎవరో అనడం విన్నాడేమో, పాకలో నుంచి లాగు తొడుక్కున్న పదేళ్ల కుర్రాడు బయటకు వచ్చాడు.

"నీ పేరేటి?" యాసతో అడిగాడు.

"అ....యా....అ....అ....యా...."

మూగవాడు ఏదో సమాధానం చెప్పడానికి ప్రయత్నించాడు.

లాగు కుర్రాడు మూగవాడిని వెంబడిస్తున్నాడు.

"వాడికి మాటలొచ్చు!" అప్పుడే వాడివెంట నడుస్తున్న మూకలో చేరిన అమ్మాయి అంది.

"నీ పేరేమిటి?"

తనకి మాటలు రావని వింత ధ్వనులు చేస్తూ ముందుకు నడిచాడు బిచ్చగాడు.

"హి హి హి! వీడికి మూగా!" అమ్మాయి నవ్వింది. అది చూసి మరొక కుర్రాడు నవ్వాడు.

బిచ్చగాడి ఆకారం, వేషం వింతగా ఉండడంతో అతను ముందుకు నడుస్తున్న కొద్దీ అతని వెనక పిల్లలమూక పెద్దదవుతోంది.

"ఏయ్! నీది ఏవూరు?"



ఈ మారు మరొక కుర్రాడు చటుక్కున అడిగాడు. బిచ్చగాడు పట్టించుకోనట్టు నటించాడు. జవాబు చెప్పే ప్రయత్నం చెయ్యనేలేదు.

"ఎక్కడనించి వచ్చావ్?"— మరొక ప్రశ్న, మరొకరు. బిచ్చగాడి వైఖరి వాడికి చిరాకనిపించింది. స్రుమన్నాడు.

"వీడికి మూగ కాదురా, ఒట్టి వేషం.... మా నాన్న చెప్పారు. వీడికి మాటలొచ్చు!"

"మాటలొచ్చు! వీడికి డబ్బులెయ్యకూడదు." బిచ్చగాడు మరో రెండు గడపలు ముందుకెళ్లాడు. గంట వాయిస్తున్నాడు.

బయటకు ఎవరో వొచ్చి తొంగి చూశారు. పళ్లెంలో డబ్బులు మెల్లగా గలగలలాడించాడు కుర్రాడు.

లోపలనుంచి వచ్చిన ఆడమనిషి పది పైసలు పళ్లెంలో వెయ్యబోయింది.

"ఇవ్వకండి! వాడికి మూగ లేదు!" —ఒకబ్బాయి అరిచాడు వెనకనించి.

"దొంగవెధవ! అంతా నటన! డబ్బు వెయ్యకండి!" మరో యిద్దరు పిల్లలు.

"—వెళ్లండర్రా పిల్లలూ; వాడేదో కూడు గడవక అడుక్కుంటూ ఉంటే గొడవచేస్తూ వాడివెంట పడతారెందుకు! పొండి ఆడుకోండి!"

ఆవిడ పదిపైసల బిళ్ల పళ్లెంలో వేసి లోపలకు వెళ్లిపోయింది.

పిల్లల కోలాహలం ఇంకొంచెం ఎక్కువైంది.

నలుగురు, ఐదుగురు, ఎనిమిది.... పది. పన్నెండుమంది పిల్లలు.

ఆరేడేళ్ల వయసునుంచి పన్నెండేళ్ల వరకు ఉన్నారు ఆ మూకలో.

"మాటలొచ్చు! మాటలొచ్చు.... డబ్బులెయ్యకండి." పిల్లలొక్కొక్కరూ ఆ మాటలే అంటున్నారు. చివరకది ఓ పాటలా వినపడుతోంది.

"మాటలొచ్చు! మాటలొచ్చు!"

పిల్లలు గేలిచేస్తున్నారు. వెంబడిస్తూనే ఉన్నారు.

'ఏయ్ పాపా! రిక్షాకింద పడతావ్ జాగ్రత్త! తప్పుకో!' రిక్షా వెళ్లిపోయింది.

వీధి చివరకొచ్చేశాడు బిచ్చగాడు. మూక కొన్ని గజాల వెనక వస్తూనే ఉంది.

"ఏయ్! నీకు బుద్ధిలేదూ.... పిల్లలతోనా నీ ఆట...." ఒక పాప తండ్రి పాపను తనతో తీసుకుపోయాడు.

పిల్లల ఈసడింపు పాట మళ్లీ మొదలైంది.

వీధిచివర ఇంటిదగ్గర గంట వాయిస్తూ ఉంటే పిల్లలు వాడిచుట్టూ గుమిగూడారు.

ఇంటి లోపలినుంచి ఒక యువకుడు వచ్చాడు. కాలేజీ విద్యార్థిలా ఉన్నాడు.

గుమ్మం దిగి మూగవాడిని చాచి ఫెట్మని లెంపకాయ కొట్టాడు.

"ఆఁయా.... ఆఁ.... ఆ.... యా"– మూగవాడు గోలపెట్టేశాడు. వాడి పళ్లెంలోని డబ్బులు ఎగిరి రోడ్డుమీద జల్లుకుపోయాయి. వాడి కంటిలో నీళ్లు. బుగ్గ తడుముకుంటున్నాడు.

–మూగవాడిని కొట్టడానికి బుద్ధిలేదూ! నీకు చదువు చెప్పిస్తున్నది ఇందుకేనా.... ఊరుకో బాబూ.... ఇంద.... ఈ పావలా తీసుకో.... జేబులోంచి తీసి యిచ్చాడాయన.

–"మాటలొచ్చు! మాటలొచ్చు!"

లాగుతో పాకలోనుంచి వచ్చిన కుర్రాడి నాయకత్వం విజృంభించింది.

"ఎవడికిరా మాటలొచ్చు! ఏదీ మాటాడించు!" తప్పున లెంపకాయ కొట్టాడా పెద్దమనిషి. పాకలోనుంచి వచ్చిన కుర్రాడు బిక్కచచ్చిపోయాడు.

పిల్లలంతా ఎక్కడివాళ్లక్కడకు మెల్లగా జారుకున్నారు. వీధి నిర్మానుష్యం అయిపోయింది.

మూగవాడు రెండు వీధులు దాటాడు. చెరువుగట్టు దగ్గరకొచ్చాడు. గట్టుమీద టీ బడ్డీ.

–'రెండు పుణుకులు.... టీయే.... అర్ధరూపాయైపోద్ది. పదిరూపాయలొట్టుకెళ్ళకపోతే అయ్య బొమికలేరేస్తాడు...'

ఉస్సురంటూ కూలబడ్డాడు బల్లమీద.

"నీకు మాటలొచ్చు! మాటలొచ్చు–"

లాగు కుర్రాడు బుగ్గ తడుముకుంటూ అన్నాడు మెల్లగా. బిచ్చగాడి కది వినిపించలేదు. బడ్డీ దగ్గర మనుషులకు అవి బోధపడినట్టూ లేదు.

———



# దేవుడిలాటోడు!

మంథా వెంకట రమణారావు

ఆ తోటలోని చెట్ల ఆకులమీద ఉదయపు ఎండ బంగారుపొడిలా పరుచుకుంది. చెట్ల నీడ నేలమీద సిరాలా పాకుతోంది.

గాలి వీచి, కొమ్మలు కదలాడినప్పుడు ఆకులమీద నీడ, నేలమీద ఎండా పడి, బంగారం సిరాగానూ, సిరా బంగారంగానూ మారుతున్నాయి.

అన్ని లక్షల ఆకులు గాలికి ఊగిసలాడుతూ, స్త్రీపురుష కంఠాలు ప్రేమతో గుసగుస లాడుకుంటున్నట్టు సడి చేస్తున్నాయి.

ఆ తోట ఊరవతల పాడుబడ్డ శివుడి కోవెల దాటాక, బోడికొండ పాదాలదగ్గరుంది. అది మామిడితోటే ఐనా, తోట చుట్టూ కంచెలా జామి, నేరేడు, ఉసిరిక, చింతచెట్లు దట్టంగా పెరిగి కాలానుగుణంగా కాపు పెడుతున్నాయి.

పాడుపడ్డ కోవెలలాగే తోటకూడా సంరక్షణ లేక చిట్టడవిలా మారింది.